# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 09-01-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- తిరుపతి తొక్కిసలాట ఘటనకు సంబంధించి సమగ్ర నివేదికను అందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.
- ఐటీ రంగానికి ప్రధాన కేంద్రంగా విశాఖపట్టణం రూపుదిద్దుకుంటోందని కేంద్రమంత్రి కె. రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.
- తిరుపతి తొక్కిసలాటలో మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారం ఈ రోజు ప్రకటించింది.
- స్వాతంత్ర్య పోరాట యోధుడు వడ్డే ఓబన్న జయంతి వేడుకలను ఈ నెల 11న అధికారికంగా నిర్వహిస్తున్నామని మంత్రి ఎస్.సవిత తెలిపారు.
- తూర్పు గాలుల ప్రభావంతో పలు జిల్లాల్లో పొగ మంచు ఏర్పడే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది.

====================================

తిరుపతి తొక్కిసలాట ఘటనలో క్షతగాత్రులైన వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఈ ఘటనలో గాయపడి స్విమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని ఆయన ఈ రోజు పరామర్శించారు. ఘటన ఎలా జరిగింది అన్నది వారిని అడిగి తెలుసుకున్నారు. బాధితులకు మంచి వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. అంతకు ముందు తిరుపతిలో తొక్కిసలాట జరిగిన ప్రమాద స్థలాన్ని ముఖ్యమంత్రి పరిశీలించారు. తొక్కిసలాటకు దారితీసిన పరిస్థితుల మీద ఆయన అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం తిరుపతి టీటీడీ పరిపాలనా భవనంలో ముఖ్యమంత్రి టీటీడీ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి.. ఘటనకు సంబంధించి సమగ్ర నివేదికను అందించాలని అధికారులను ఆదేశించారు. ఆ తర్వాత నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ..

(వాయిస్ 25 సెకన్లు)

====================================

తిరుపతిలో జరిగిన తొక్కిసలాటలో మరణించిన వారి కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారం ప్రకటించింది. వైకుంఠ ఏకాదశి సర్వదర్శన టోకెన్ల జారీ సందర్భంగా నిన్న జరిగిన తొక్కిసలాట ఘటనలో ఆరుగురు భక్తులు ప్రాణాలు కోల్పోయిన నేపధ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తిరుపతిలో పాత్రికేయులకు తెలియచేసారు. ఆయన ఈ రోజు తిరుపతిలోని రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. తొక్కిసలాటలో భక్తులు చనిపోవడం బాధకరమని విచారం వ్యక్తం చేశారు.

====================================

ఐటీ రంగానికి ప్రధాన కేంద్రంగా విశాఖపట్టణం రూపుదిద్దుకుంటోందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణను సిద్ధం చేస్తోందని అన్నారు. విశాఖపట్టణంలో నిర్వహిస్తున్న డిజిటల్ టెక్నాలజీ రాష్ట్ర స్థాయి సదస్సులో భాగంగా రెండవ రోజు అయిన ఈ రోజు జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... త్వరలో ఐటీ దిగ్గజ సంస్థలు విశాఖపట్టణానికి నున్నాయని తెలిపారు. విశాఖపట్నం అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి పెట్టాయని చెప్పారు. ప్రపంచంలోనే విశాఖను ముందువరసలో నిలబెట్టే ప్రయత్నం జరుగుతోందని అన్నారు. కాగా, సాంకేతిక రంగంలో అభివృద్ధి సాధించేందుకు వినూత్న ఆలోచనలతో యువత ముందుకు రావాలని ఈ సందర్భంగా యువతకు కేంద్ర మంత్రి పిలుపు నిచ్చారు.

====================================

రాష్ట్రంలో ఈ నెల 11న అన్ని జిల్లా కేంద్రాలలో తొలి స్వాతంత్ర్య పోరాట యోధుడు వడ్డే ఓబన్న జయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లుగా రాష్ట్ర బి.సి సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. రాష్ట్ర సచివాలయంలో ఈ రోజు మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం వెనకబడిన వర్గాలలో ప్రముఖులైన విశ్వకర్మ, వాల్మీకి కనకదాస జయంతులను ఎంతో ఘనంగా నిర్వహించిందని అన్నారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా బీసీలకు బడ్జెట్ లో 39 వేల కోట్ల రూపాయలు కేటాయించామని గుర్తు చేశారు. అదే విధంగా అమరావతిలో 5 ఎకరాలలో బీసీ స్టడీ సర్కిల్ నిర్మించబోతున్నామని మంత్రి వెల్లడిస్తూ...

(వాయిస్ 32 సెకన్లు)

====================================

ప్రపంచ వ్యాప్తంగా ఎక్కువ మంది మాట్లాడే భాషలలో తెలుగు కీలక స్థానంలో ఉందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి పేర్కొన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరంలో నిర్వహించిన 2వ ప్రపంచ తెలుగు మహాసభలలో ఆమె ఈ రోజు ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... దేశంలో ప్రాచీన భాషగా గుర్తింపు పొందిన 6 భాషల్లో తెలుగు ఒకటని చెప్పారు. కాగా, భాషతో పాటు తెలుగు సంస్కృతిని అంతా అర్థం చేసుకోవాలని ఆమె కోరారు. మాతృభాషను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని పురందేశ్వరి పేర్కొన్నారు.

విరామం

====================================

సంక్రాంతి పండుగ సందర్భంగా కోడిపందేలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ హెచ్చరించారు. అమలాపురం కలెక్టర్ కార్యాలయంలో రెవెన్యూ, పోలీస్ అధికారులతో ఆయన ఈ రోజు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... గేమింగ్ చట్టం 1974,

జంతు హింస నివారణ చట్టం 1960 ప్రకారం కోడి పందేలను నిర్వహించే వారిపైన క్రిమినల్ చర్యలు కింద నమోదు చేస్తామన్నారు. జిల్లాలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి కోడిపందేలు నిర్వహించకుండా చూస్తున్నామని తెలిపారు.

====================================

ఏలూరు జిల్లాలో 669 గ్రామాలలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల ద్వారా 6 వేల 453 అర్జీలను స్వీకరించడం జరిగిందని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. జిల్లాలో ఈ నెల 8 వరకు భూ సమస్యలపై రెవెన్యూ సదస్సులను నిర్వహించామన్నారు. వచ్చిన అర్జీలలో ఇప్పటికే 3 వేల 312 అర్జీలను పరిష్కరించామని తెలిపారు. నిర్ణీత సమయంలోగా నూరు శాతం అర్జీలను పరిష్కరించడం జరుగుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు.

====================================

రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీల జనాభా వివరాలతో సోషల్ ఆడిట్ నిర్వహించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని పార్వతీపురం మన్యం జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికారిత అధికారి యం.డి. గయాజుద్దీన్ తెలిపారు. జిల్లా కేంద్రంలో ఈ రోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... ఎస్సీ కులగణన వివరాలను గత డిసెంబర్ 26వ తేదీ నుంచి గ్రామ, వార్డు సచివాలయాలలో ప్రదర్శించామన్నారు. అభ్యంతరాల స్వీకరణకు గడువును ఈనెల 12వ తేదీ వరకు పొడిగించామని తెలిపారు. 16వ తేదీ వరకు అభ్యంతరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సమగ్ర వివరాల సేకరణ అనంతరం ఈనెల 20న కులగణన తుది వివరాలను గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రదర్శిస్తామని పేర్కొన్నారు.

====================================

రాష్ట్రంలో తూర్పు గాలుల ప్రభావంతో పలు ప్రాంతాలలో పొగ మంచు ఏర్పడే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఉత్తర కోస్తా, దక్షిణ కోస్తా జిల్లాలలో పొడి వాతావరణంతో పాటు పొగ మంచు ఏర్పడే అవకాశం ఉందని వెల్లడించారు. ఆ వివరాలను వాతావరణ అధికారి తెలియచేస్తూ....

(వాయిస్ 26 సెకన్లు)

====================================

రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు అన్ని విద్యా సంస్థలు సంక్రాంతి సెలవులు అమలు చేయాలని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ గొండు సీతారాం అన్నారు. ఈ నెల 10 నుండి 19వ తేదీ వరకు ప్రైవేట్ విద్యా సంస్థలు కూడా సంక్రాంతి సెలవులు ఇవ్వాలని ఈ రోజు విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఆయన కోరారు. సెలవులలో పాఠశాలలు నిర్వహించే యాజమాన్యాల పైన కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు.

====================================

విజయనగరంలో మార్చి 8వ తేదీన జరగబోయే జాతీయ లోక్ అదాలత్ ను విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కళ్యాణ్ చక్రవర్తి కోరారు. జిల్లాలోని తన ఛాంబర్ లో పోలీసు సూపరింటెండెంట్ వకుల్ జిందాల్, ఇతర అధికారులతో ఈ రోజుసమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జిల్లాలో చెక్ బౌన్స్ కేసులకు సంబంధించి వారెంట్ పెండింగ్ వివరాలు సేకరించి, వాటిని జరగబోయే జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించాలని సూచించారు.

====================================

సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి పండుగని పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. భీమవరంలో సంక్రాంతి సందర్భంగా ఏర్పాటు చేసిన బొమ్మల కొలువును ఆమె ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... బుద్ధిని వృద్ధి చేసుకోవడం అనేది సంక్రాంతి పండుగలోని ఆంతర్యం అన్నారు.

===================================

===================================